ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)
APTEL/2024/89102

సంపుటి : 02 సంచిక : 79 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం 21 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02

"పుట్టినరోజు.. మీ ఊరొచ్చా!" - బాబు

# "డీఎంకే ఏం సాధించింది?" - బాబు నిలదీత

- అభివృద్ధికి ఎన్డీయేకు ఓటేయండి - ఏపీనే నిదర్శనం
- గోదావరి నీళ్లు కావేరికి తెస్తాం!
- మహిళా బిల్లుకు డీఎంకే మోకాలొడ్డు



**ఎన్టీఆర్, ఎంజీఆర్ మధ్య మంచి స్నేహం ఉండటంతో అప్పట్లో తెలుగుగంగను ప్రారంభించి తమిళనాడుకు నీరిచ్చారు. తమిళనాడుకు శ్రీరామరక్షగా గంగ- కావేరి నదుల అనుసంధానం చేయాలనే లక్ష్యంతో మోదీ ఉన్నారు. ఇందులో భాగంగా తొలి విడతగా ఏపీలోని నదుల అనుసంధానం తర్వాత తమిళనాడుకు నీరివ్వాలని ఆయన తపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు విజయవంతంగా పూర్తిచేసి, తమిళనాడుకూ నీళ్లిస్తాం. - చంద్రబాబు**

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం రావడంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. డబులింజిన్ సర్కారు ఫలితం ఎలా ఉంటుందో తమ రాష్ట్రాన్ని చూసి తెలుసుకోవచ్చన్నారు. మీకూ అలాంటి అభివృద్ధి కావాలంటే ఎన్డీయేను గెలిపించాలని తమిళనాడు ఓటర్లకు పిలుపునిచ్చారు. చంద్రబాబు సోమవారం తమిళనాడులోని కోయంబత్తూర్, కృష్ణగిరి జిల్లా తళి, చెన్నై అన్నానగర్ నియోజకవర్గాల్లో ఎన్డీయే తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోయంబత్తూర్‌లో వివిధ రంగాలకు చెందిన తెలుగువారు, నిపుణులతో భేటీ అయ్యారు. ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ 'ఏపీలో 2019లో మేం ఓడిపోతే ఓ పార్టీ వచ్చి ఐదేళ్లు విధ్వంస పాలన చేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌ను కాపాడేందుకు పవన్ కల్యాణ్‌తో కలిసి రాజకీయంగా ముందుకెళ్లాం. మేమిద్దరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి ఏపీలో ప్రగతిని కొత్తపుంతలు తొక్కిస్తున్నాం. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయంటే అది డబులింజిన్ సర్కారు విజయమే. ఏపీలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో తయారు చేయబోతున్నాం. అమరావతిలో 5వేల ఎకరాలతో కొత్త విమానాశ్రయాన్ని నిర్మించబోతున్నాం' అని వివరించారు.

# మహిళా బిల్లును చంపింది మోదీయే

- ★ మేం వ్యతిరేకించింది డీలిమిటేషన్ బిల్లును మాత్రమే
- ★ సార్వత్రిక ఎన్నికలను ముందుకు జరపాలని ప్రధాని ప్రయత్నం
- ★ బెంగాల్‌కు మోదీ సీఎం అవుతారేమో.. ఇక్కడే తిష్ఠ వేశారు: ఖర్గే
- ★ అధికారిక విధుల్ని విస్మరించి బెంగాల్లోనే ఉంటారా?
- ★ మోదీ ప్రిజర్వేషన్: కాంగ్రెస్
- ★ మహిళల్ని వంచించిన తృణమూల్: భాజపా



# మహిళా రిజర్వేషన్లకు సరికొత్త 'మార్గం'

- బిల్లులో సవరణలపై కేంద్రం సమాలోచనలు
- న్యాయ నిపుణులతో సంప్రదింపులు
- మళ్లీ పార్లమెంట్ ముందుకు కొత్త బిల్లు?
- నిపుణుల కమిటీ కసరత్తు




# రాజస్తాన్‌లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం

- ప్రధాని మోడీ ప్రారంభానికి ఒకరోజు ముందు ఘటన
- ప్రాణనష్టం జరగలేదని అధికారుల వెల్లడి
- ప్రమాదంపై మాజీ సీఎం అశోక్ గెహ్లోత్ ఆందోళన
- 2013లోనే ఈ రిఫైనరీకి సోనియాగాంధీ శంకుస్థాపన
- దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ
- ప్రధాని మోడీ పర్యటనకు సన్నాహాలు
- వేదిక వద్ద 100కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు



# ఇక బలీయ బంధం

**2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు వార్షిక వాణిజ్యం**

ఏడాదిలోగా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ఉన్నతీకరణ భారత ప్రధాని మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ నిర్ణయం

భారత్‌లో కొరియన్ పారిశ్రామిక టౌన్‌షిప్

అవి రెండు దేశాల డీఎన్ఏలో ఉన్నాయి

కీలక రంగాల్లో పరస్పర సహకారానికి 15 ఒప్పందాలపై ఇరుదేశాల సంతకాలు



# నిప్పుల కొలిమే

## ఏప్రిల్ 25 వరకు దేశంలో తీవ్ర వడగాల్పులు!




- నాలుగైదు రోజులు ఆ రాష్ట్రాల్లో తీవ్ర వడగాల్పులు : ఐఎండీ హెచ్చరిక
- ఏప్రిల్ 25 వరకు దేశంలో తీవ్ర వడగాల్పులు
- పలు రాష్ట్రాల్లో వడగండ్ల వానలు
- ఈశాన్య రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు
- ఉరుములతో కూడిన వర్షాలు, వడగండ్ల వానలు
- రాత్రి వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు
- ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి

దేశంలో ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతుండగా రానున్న నాలుగైదు రోజుల పాటు దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు (హీట్ వేవ్స్) వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. ముఖ్యంగా ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 25 మధ్య హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్, తూర్పు రాజ స్తాన్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పశ్చిమ రాజస్తాన్, మధ్యప్రదేశ్, గంగానది పరివాహక పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని తెలిపింది.

**ఈశాన్య రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు**

ఈశాన్య రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో ఏప్రిల్ 23 వరకు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని పేర్కొంది. అదే విధంగా నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురల్లోనూ ఏప్రిల్ 22 వరకు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని అంచనా వేసింది.

# జేఈఈ ఫలితాలు విడుదల

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జేఈఈ మెయిన్ సెషన్ 2 ఫలితాలను విడుదల చేసింది. జనవరి , ఏప్రిల్ నెలల్లో జరిగిన రెండు సెషన్లకు సంబంధించిన తుది ఫలితాలు, ఆల్ ఇండియా ర్యాంకులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్ , పుట్టిన తేదీ వివరాలను ఉపయోగించి అధికారిక వెబ్‌సైట్ ద్వారా స్కోర్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



# డీఎంకే ఎం సాధించింది

**కాంగ్రెస్, డీఎంకే కూటమిని నిలదీయండి :** మహిళా బిల్లు, లోక్‌సభ స్థానాల పునర్విభజనను వ్యతిరేకించి కాంగ్రెస్, డీఎంకే, మిత్రపక్షాలు పెద్ద తప్పు చేశాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వీగిపోయేలా చేసి ఢిల్లీని, మోదీని ఓడించామని డీఎంకే విర్రవీగుతోందని.. దాంతో వారేం సాధించారని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న 130 సీట్లు 50 శాతం పెరిగి 195కు చేరేవని.. కేవలం రాజకీయ ఎజెండాతో కాంగ్రెస్, డీఎంకే, మిత్రపక్షాలు వ్యతిరేకించాయని ధ్వజమెత్తారు. 2026-27 జనాభా లెక్కలతో పునర్విభజన చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారని, దానివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. 'వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడు 1991 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 1971 జనాభా సంఖ్యను ఫ్రీజ్ చేసి రిజర్వేషన్లు చేయాలని నేను డిమాండ్ చేశాను. అలా చేస్తే ఏ రాష్ట్రానికీ నష్టం జరగదన్నాను. అప్పట్లో కాంగ్రెస్ సహకరించలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాజ్యసభలో బిల్లులు పెట్టినా లోక్‌సభలో వారి మిత్రపక్షాల నుంచే వ్యతిరేకత వచ్చింది. ప్రస్తుతం కొత్త సవరణ ద్వారా ప్రతి రాష్ట్రం 50 శాతం సీట్లు పెరిగేలా, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వచ్చేలా చేయాలని ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం దూరదృష్టితో చేసింది' అని వివరించారు. 'ఇలాంటి బిల్లుల్ని వ్యతిరేకించి ఎందుకు తప్పు చేశారని ఓటర్లు కాంగ్రెస్, డీఎంకే కూటమిని ప్రశ్నించాలి. ఇది తమిళనాడు నుంచే మొదలవ్వాలి. సంస్కరణలతో దేశాన్ని నంబర్‌వన్‌గా చేసిన మోదీకి మద్దతు తెలపాలి. సంస్కరణల వ్యతిరేక పార్టీల్ని ఓడించాలి' అని పిలుపునిచ్చారు.

**అవినీతి, అప్పుల భారమేనా మీ గొప్ప?**

'విమానాశ్రయాలతో ఉద్యోగాల కల్పన ఉంటుంది. కానీ చెన్నైలో విమానాశ్రయం అభివృద్ధి చెందలేదు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల నిర్మాణంలో స్టాలిన్ సర్కారు విఫలమైంది. కేంద్రం తమిళనాడుకు సహకరించినా.. డీఎంకే సరిగా వాడుకోలేదు. అవినీతి, శాంతిభద్రతల సమస్య, డ్రగ్స్, ప్రజలపై అప్పుల భారం తప్ప డీఎంకే ఏం సాధించింది? ఇక్కడ మహిళలపై 59 శాతం, ఎస్సీలపై 39 శాతం నేరాలు పెరిగాయి. ఒక్కో మద్యం సీసాపై రూ.10 అదనంగా వసూలు చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. మరోవైపు హిందూ ధర్మాన్ని ఎగతాళి చేస్తున్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్నాదురై డీఎంకే పెడితే ఇప్పుడు స్టాలిన్ అదే కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పనిచేస్తున్నారు. శ్రీలంకలో తమిళుల కష్టాలకు కాంగ్రెస్, డీఎంకేనే కారణం' అని విమర్శించారు. తమిళనాడులో కేంద్ర ప్రభుత్వమే 4,000 కి.మీ. రహదారులు నిర్మించిందని గుర్తు చేశారు.

**పుట్టినరోజు.. మీ ఊరొచ్చా!- తమిళ ఓటర్లతో బాబు సందడి**

'ఈ రోజు నా పుట్టినరోజు. మీ ఊరికి వచ్చా. నాకెంతో సంతోషంగా ఉంది' అని చంద్రబాబు తమిళ ఓటర్ల మధ్య సందడి చేశారు. తళి నియోజకవర్గంలోని డెంకణీకోటలో ఎన్నికల బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సభకు విచ్చేసిన వేల మంది అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు ప్రకటించడంతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. 'ప్రపంచంలో మరే భాషకూ లేనంత ప్రాధాన్యం తమిళం సొంతం చేసుకుంది. తమిళులు తిరుపతికి వస్తారు. తెలుగువారు తిరువణ్ణామలై సందర్శించి సంబరపడిపోతుంటారు' అని పేర్కొన్నారు. డెంకణీకోట- తిరుపతి మధ్య బస్సు నడపాలని స్థానికులు కోరగా చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి, మాజీ ఎంపీ నరసింహన్, కర్ణాటక విధానసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్, భాజపా తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి అమర్‌ప్రసాద్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు బాలాజీ ఉత్తమ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాజస్తాన్‌లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం

జైపూర్: ప్రధాని మోడీ చేతుల మీదుగా నేడు (ఏప్రిల్ 21) ప్రారంభం కావాల్సిన రాజస్తాన్‌లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం రిఫైనరీలోని క్రూడ్ డిస్టిలేషన్ యూనిట్‌లో భారీగా మంటలు చెలరేగాయి. మంగళవారం ప్రధాని మోడీ అక్కడ పర్యటించి రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ కూడా సోమవారం సాయంత్రం రిఫైనరీని సందర్శించనున్నారని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని, అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టంపై అంచనా వేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

**ప్రమాదంపై మాజీ సీఎం అశోక్ గెహ్లోత్ ఆందోళన :** రిఫైనరీలో జరిగిన అగ్నిప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రిఫైనరీ రాజస్తానీయులందరికీ గర్వకారణమైన ప్రాజెక్ట్ అని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఈ ప్రాజెక్టను ప్రధాని మోడీ ప్రారంభించనున్న తరుణంలో ప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారందరూ సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

**2013లోనే ఈ రిఫైనరీకి సోనియాగాంధీ శంకుస్థాపన:** రాజస్తాన్‌లో అశోక్‌గహ్లోత్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 2013లో సోనియాగాంధీ ఈ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. బలోత్రాలోని ఈ రిఫైనరీని దేశపు తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దారు. హిందుస్థాన్ పెట్రోలియం, రాజస్తాన్ ప్రభుత్వం మధ్య జాయింట్ వెంచర్‌గా ఇది ఏర్పాటైంది. అప్పుడు ప్రాజెక్ట్ వ్యయం రూ.43,129కోట్లు. అనంతరం జనవరి 16, 2018లో నరేంద్ర మోడీ ప్రభుత్వం దీనిని రీలాంచ్ చేసింది. ఈ మొత్తాన్ని రూ.79,459 కోట్లకు సవరించి ఈ ప్రాజెక్ట్ చేపట్టారు.

**దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ :** 4,400 ఎకరాల్లో విస్తరించిన ఈ రిఫైనరీలో ఇంధనంతో పాటు భారీగా పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేస్తుంది. ప్లాస్టిక్, వ్యవసాయ పైపులు, ప్యాకేజింగ్ ఫిల్మ్‌లు, ఆటో విడిభాగాలు, సింథటిక్ ఫైబర్, వైద్య పరికరాలు, పెయింట్లు, డిటర్జెంట్ల తయారీకి ఇక్కడ తయారయ్యే పెట్రోకెమికల్స్ ఉపయోగ పడతాయి. ఇది అందుబాటులోకి వస్తే దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ- పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు మొత్తం వార్షిక సామర్థ్యం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా ఇందులో పెట్రోరసాయనాల ఉత్పత్తుల సామర్థ్యం 2.4 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది.

**ప్రధాని మోడీ పర్యటనకు సన్నాహాలు :** ఇదిలా ఉండగా ప్రధాని మోడీ బచ్‌పద్రలో రిఫైనరీని ప్రారంభించి బహిరంగ సభలో ప్రసంగించనున్న నేపథ్యంలో అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ముగ్గురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్ (డీఐజీలు), 12 మంది సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీలు), సుమారు 5,000 మంది పోలీస్ సిబ్బందిని మోహరించనున్నారు.

**వేదిక వద్ద 100కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు :** ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు సౌకర్యవంతంగా ఉండేందుకు విస్తృత ఏర్పాట్లు చేశామని జోధ్‌పూర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) సత్యేంద్ర సింగ్ తెలిపారు. ꞉꞉వివిధ జిల్లాలను కలుపుతూ ఆరు వేర్వేరు మార్గాల్లో పార్కింగ్ సౌకర్యాలు కల్పించాం. వాహనాల రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ మళ్లింపులు కూడా అమలు చేశాం꞉꞉ అని ఆయన అన్నారు. కార్యక్రమ వేదిక వద్ద కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు 100కుపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు ఐజీపీ సత్యేంద్ర సింగ్ తెలిపారు. అయితే రిఫైనరీ దగ్ధమవటంతో..మోడీ బహిరంగసభకు పరిమితమవుతారా..? రిఫైనరీ సందర్శిస్తారా..? అన్నదానిపై చర్చనడుస్తోంది.

# మహిళా బిల్లును చంపింది మోదీయే

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) బిల్లునే విపక్షం వ్యతిరేకించిందని, ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం మహిళా రిజర్వేషన్ బిల్లును చంపేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుల్ని వ్యతిరేకించడం ద్వారా విపక్షం 'భ్రూణహత్య'కు పాల్పడిందని ప్రధాని ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. మహిళా కోటాను తాము వ్యతిరేకించలేదని, విపక్షాల పోరాటమంతా డీ లిమిటేషన్ బిల్లుపైనే అని స్పష్టంచేశారు. సోమవారం పశ్చిమబెంగాల్‌లోని కూచ్ బిహార్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మహిళా కోటా పేరుతో డీ లిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసేందుకు భాజపా ప్రయత్నించి, చివరకు విఫలమైందని ఎద్దేవా చేశారు. వీగిపోయింది ముమ్మాటికీ ఆ బిల్లేనని చెప్పారు. "నియోజకవర్గాల పునర్విభజనను ముందుకు జరిపి దేశంలో సార్వత్రిక ఎన్నికలను ముందుగానే నిర్వహించాలని మోదీ భావిస్తున్నారు. మీరు (మోదీ) ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు పొడిచారు. మహిళా సాధికారతకు పాటుపడుతున్నట్లు చెప్పుకొంటున్నారు. మహిళా హక్కులు, వారి సంక్షేమం మాకెంతో ప్రాధాన్య అంశం. 2010లోనే రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును యూపీఏ సర్కారు ఆమోదించింది. మోదీ సర్కారు 30 నెలలుగా దానిపై నిద్రపోయి.. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ముందు మేల్కొంది. సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ వంటి మహిళా నేతలు మా పార్టీవారే. భాజపా ఒక్కసారైనా మహిళకు అధ్యక్ష పదవిని ఇచ్చిందా?" అని ప్రశ్నించారు.

**అధికారిక విధుల్ని విస్మరించి బెంగాల్లోనే ఉంటారా?**

చాలా రోజులుగా మోదీ బెంగాల్లో నలుమూలలా తిరుగుతూ తన అధికారిక విధుల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఖర్గే మండిపడ్డారు. ఆయన ప్రధానిగా కొనసాగదలచుకున్నారా, లేదంటే బెంగాల్‌కు సీఎం అవుదామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మోదీ చేస్తున్న ఎన్నికల ప్రచారం వల్ల శాంతికి విఘాతం కలిగి, సమాజంలోని భిన్న విశ్వాసాలవారి మధ్య ఉద్రిక్తత తలెత్తుతోందని చెప్పారు. ఇలాంటి ఎత్తుజిత్తులకు ఇంకెక్కడైనా ఫలితం ఉంటుందేమో గానీ బెంగాల్ ప్రజలు మాత్రం పడిపోరని పేర్కొన్నారు. బెంగాల్లో కాంగ్రెస్ పార్టీ కొన్ని పార్టీలతో ఎన్నికల పొత్తులు పెట్టుకుని చాలా నష్టపోయిందని చెప్పారు.

**మోదీ ప్రిజర్వేషన్: కాంగ్రెస్**

మహిళలకు రిజర్వేషన్ కల్పించడం కేంద్రం ఉద్దేశం కాదని, ప్రధాని నరేంద్రమోదీ 'ప్రిజర్వేషన్' (పరిరక్షించుకునే) ప్రయత్నమని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగా మహిళా కోటాను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఆ మేరకు బిల్లు తీసుకురావాలని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విజ్ఞప్తి చేశారు. కులగణనను మరుగున పడేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. భాజపా ప్రచారంతో మహిళలు మోసపోయేది లేదని చెప్పారు.

**మహిళల్ని వంచించిన తృణమూల్: భాజపా**

చట్టసభల్లో 2029 నుంచి 33% మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని వ్యతిరేకించడం ద్వారా మహిళల్ని తృణమూల్ కాంగ్రెస్ వంచించిందని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. ఒకవేళ ఇది మైనారిటీలకు సంబంధించిన అంశమే అయితే మమత అన్నివిధాలా మద్దతు ఇచ్చేవారని చెప్పారు. సోమవారం పశ్చిమబెంగాల్‌లోని తూర్పు మేదినీపుర్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఆడబిడ్డల భద్రతను గాలికి వదిలేసి చొరబాటుదారుల్ని కాపాడేందుకు తృణమూల్ సర్కారు ఆరాటపడుతోందని, దీనిని ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎంగా మహిళ ఉన్న రాష్ట్రంలోనూ మహిళలకు భద్రత కరవైందని విమర్శించారు. పదవిలో కొనసాగే నైతిక హక్కును మమత కోల్పోయారన్నారు. భాజపా సర్కారు అధికారంలోకి వచ్చి చొరబాటుదారుల్ని తరిమికొడుతుందని, బుజ్జగింపు రాజకీయాలకు తెర దించుతుందని హామీ ఇచ్చారు. సనాతన వ్యతిరేక శక్తులకు దీటైన జవాబు లభిస్తుందన్నారు.

## చంద్రబాబు సేన అధ్యక్షులు గుమ్మడిపూడి కల్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలుభారీ కేక్ కటింగ్ అన్నదాన కార్యక్రమం







**విజ్ఞాన్ దినపత్రిక టౌన్ రిపోర్టర్** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబు సేన అధ్యక్షులు గుమ్మడిపూడి కల్యాణ్ ఆధ్వర్యంలో గీతామయి బాలభవన్ నందు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. అనంతరం భారీ కేక్ కట్ చేసి పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు లాంటి దార్శనిక నాయకుడు రాజనీతిజ్ఞుడు మరొకరు లేరన్నారు వారి ముందుచూపుకు నిదర్శనం నాడు హైటెక్ సిటీ అయితే నేడు క్వాంటం వ్యాలి అని తెలిపారు. లక్షలాది మందికి ఐటి ఉద్యోగాలు సృష్టించిన చంద్రబాబు ఆధ్వర్యంలోనే రాజధాని అమరావతి , ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్ట , అదేవిధంగా రాష్ట్రం నలుమూలలా సమగ్ర అభివృద్ధితో ముందుకు తీసుకెళుతున్న చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ళు ఇదే ఉత్సాహంతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారుఈ కార్యక్రమంలో వేలూరు రాజ, 47 డివిజన్ కార్యదర్శి లక్ష్మీ ప్రసాద్,



ఆనంద్ కుమార్, కంచి రాధాకృష్ణ, పెళ్ళూరు రమేష్ , వేలూరు చిరంజీవి వర్మ, తాతిరెడ్డి శ్రీధర్ రెడ్డి , శరత్ బాబు, రాజ, నితిన్, క్లష్టర్ ఇంచార్జ్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు

# ఇక బలీయ బంధం

ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, దక్షిణ కొరియా నిర్ణయించుకున్నాయి. వార్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసి.. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చాలని తీర్మానించాయి. అంతేకాకుండా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ఏడాది లోగా మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయానికొచ్చాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ సోమవారం ఢిల్లీలో సమావేశయ్యారు. ఇరుదేశాల మధ్య స్నేహ సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కీలక రంగాల్లో సరస్పర సహకారానికి సంబంధించి ఇరుదేశాల మధ్య 15 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఇంధనం, రక్షణ, అరుదైన ఖనిజాలు, నౌకా నిర్మాణం, సెమీకండక్టర్ల వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని మోదీ, లీ జే మ్యుంగ్ నిర్ణయించారు. ఇండియా--సౌత్ కొరియా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం ఒక ఉమ్మడి వ్యూహాత్మక విజన్‌ను ఆవిష్కరించారు. నౌకా నిర్మాణం, నౌకా రవాణా, సముద్ర రవాణా రంగాల్లో భాగస్వామ్యం కోసం ఒక సమగ్ర విధానాన్ని భారత్, దక్షిణ కొరియా విడుదల చేశాయి. ఇంధన భద్రతపై ఒక సంయుక్త ప్రకటనను సైతం వెలువరించాయి.


**భారత్‌లో కొరియన్ పారిశ్రామిక టౌన్‌షిప్ :** 2010లో అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని ఉన్నతీకరించడమే లక్ష్యంగా చర్చలను పునఃప్రారంభించడంపై ఒక ఉమ్మడి ప్రకటనపై భారత్, దక్షిణకొరియా సంతకాలు చేశాయి. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకొనే చర్యల్లో భాగంగా భారత్‌లో కొరియన్ పారిశ్రామిక టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరింది. వాతావరణ మార్పు, ఆర్కిటిక్, సముద్ర సహకారంపై చర్చల కోసం న్యూఢిల్లీ, సియోల్ 'ఎకనామిక్ సెక్యూరిటీ డైలాగ్'తోపాటు విదేశాంగ మంత్రిత్వ శాఖల ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ప్రారంభించాయి. పశ్చిమాసియా పరిణామాలపై మోదీ, లీ జే మ్యుంగ్ చర్చించుకున్నారు. ఇండో--పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు పెరుగుతుండడం కూడా చర్చకు వచ్చింది. ఈ నేపథ్యంలో శాంతియుత, స్థిరమైన, సమ్మిళిత ఇండో--పసిఫిక్ దిశగా ఉమ్మడి ప్రయత్నాలను బలోపేతం చేస్తామని భారత్, దక్షిణ కొరియా తేల్చిచెప్పాయి.

**అవి రెండు దేశాల డీఎన్ఏలో ఉన్నాయి :** ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో తమ రెండు దేశాలు శాంతి, స్థిరత్వ సందేశాన్ని అందిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్, దక్షిణ కొరియా మధ్య ప్రస్తుతం వార్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు చెప్పారు. దీన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, చట్టబద్ధమైన పాలన పట్ల గౌరవం అనేవి రెండు దేశాల డీఎన్ఏలో ఉన్నాయని ఉద్ఘాటించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం ఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి

**విజ్ఞాన పత్రిక, మణికుమార్ కారంపూడి (ఏప్రిల్ :21)** పల్నాడు జిల్లా కారంపూడి శివారులోని పేటసన్నిగండ్ల గ్రామ సమీపంలో బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరి మృతి చెందినట్లుగా తెలుస్తుంది.! కారంపూడి మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన కోళ్ల ఫారం యజమాని కి చెందిన బొలెరో మాక్స్ అతివేగంతో బైక్ పై వెళుతున్న ఇద్దరిని ఢీ కొట్టి తొక్కించిన ఘటనలో ఇద్దరు ఘటనా స్థలంలోనే చనిపోయారు, చనిపోయిన వారు పిడుగురాళ్లకి చెందినవారుగా తెలుస్తుంది. వారు అడిగొప్పల శ్రీ లక్ష్మీ అమ్మవారు గుడికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది ఈ ప్రమాదానికి కోళు రవాణా చేసే బొలెరో మాక్స్ అతివేగమే కారణంగా అక్కడ ప్రజలు చెప్పుకుంటున్నారు





# మంతనాలు

ఒక మంచి వాడు
నష్టపోతున్నాడంటే
చెడ్డ వారు ఒక్కటై ఉండాలి
ఏమి తెలియని అమాయకుల్ని
లోబరుచుకోవడానికి
వాళ్ళు ఎన్నో మంతనాలు
పన్నాగాలు జరుపుతూ ఉంటారు
మనిషి అవకాశాన్ని బట్టి
అవసరాన్ని బట్టి
బాగా దెబ్బ కొడతాడు
కరెన్సీ నోట్లు మీద
కాపురాలు నడుస్తున్న రోజులు
నీ దగ్గర డబ్బు లేకుంటే
నీకు ప్రేమ అనేది దక్కదు
అసలు నీకు సమాజంలో
గౌరవమే ఉండదని గ్రహించు!
ఒక మంచి మాట దానం లాంటిది
ప్రతిఫలంగా పుణ్యాన్నిస్తుంది
చెడ్డ మాట అప్పు లాంటిది
దానికి మాత్రం ప్రతిఫలంగా
వడ్డీతో సహా చెల్లించాలి
అందుకే... మంచినే పంచండి!
చెడుని మాత్రం తుంచేయండి!!



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# చంద్రబాబు నాయుడు జన్మదిన కానుకగా బుచ్చిరెడ్డి పాళెం మార్కెట్ కాంప్లెక్స్

- పి-4 విధానంలో నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ బుచ్చిరెడ్డి పాళెం వాసుల దశాబ్దాల కల.
- సిఎం చంద్రబాబు నాయుడు గారి పి-4 విధానానికి ఆకర్షితులై మార్కెట్ నిర్మాణానికి ముందుకొచ్చిన తేజా బిల్డర్స్ యాజమాన్యానికి అభినందనలు.
- మహిళలను ఉన్నత స్థానాల్లో చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం.
- పార్లమెంటులో మహిళా బిల్లును అడ్డుకున్న మహిళా వ్యతిరేకులను చరిత్ర క్షమించదు.
- సీఎం చంద్రబాబు జన్మదిన పురస్కరించినుకొని మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాలకు 1 కోటి 60 లక్షల రుణాలు. : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.





**విజ్ఞాన్ దినపత్రిక బుచ్చిరెడ్డిపాలెం రిపోర్టర్ :** పి-4 విధానంలో నిర్మించిన బుచ్చిరెడ్డిపాళెం మార్కెట్ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి జన్మదిన కానుకగా అందించారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి . బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ఆమె అధునాతన వసతులతో సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పి-4 విధానంలో నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ బుచ్చిరెడ్డి పాళెం వాసుల దశాబ్దాల కల అయిన మార్కెట్ కాంప్లెక్స్ ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలులభించనున్నాయన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు పి-4 విధానానికి ఆకర్షితులై మార్కెట్ నిర్మాణానికి ముందుకొచ్చిన తేజా బిల్డర్స్ అధినేతలు శ్రీనివాసులు రెడ్డి పెంచలయ్య ను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని భావించినప్పటికీ, వారుఎన్నికల ప్రచారాలు మరియు అధికారిక కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో సామాన్య వ్యాపారుల కోసం ముందస్తుగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎండ తీవ్రత వల్ల రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వారు ఇబ్బందులు పడుతున్నారని,కూరగాయలు పాడైపోతున్నాయన్న వారి ఆవేదనను గమనించి ముఖ్య అతిథుల రాక కోసం వేచి చూడకుండానే వ్యాపారుల కోరిక మేరకు మార్కెట్‌ను ప్రారంభించి ముఖ్యమంత్రికి జన్మదిన కానుకగా అంకితం మిచ్చామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడి మార్కెట్ పరిసరాల్లో అన్న క్యాంటీన్ నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. దీంతో కేవలం ఐదు రూపాయలకే పేదలకు కడుపునిండా భోజనం అందుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి సతీమణి రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఉచితంగా కడుపు నిండా భోజనం పెట్టాలన్న లక్ష్యంతో 76 లక్షల రూపాయలు విరాళమిచ్చిన స్ఫూర్తిగా స్వీకరించి ఇకపై ఎవరూ కూడా తనపై అభిమానంతో పూలమాలలు, శాలువాలు తీసుకురావద్దని, ఆ ఖర్చును అన్న క్యాంటీన్ విరాళంగా ఇస్తే పేద ప్రజల ఆకలి తీర్చవచ్చని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు.చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు 1 కోటి 60 లక్షల రూపాయల రుణాలు పంపిణీ చేయడం పట్ల హర్షం ఆమె వ్యక్తం చేశారు. మహిళలను ఉన్నత స్థానాల్లో చూడాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా చట్టసభల్లో 33 శాతం వాటా కల్పించేందుకు ఆయన కృషి చేస్తుంటే, కొందరు మహిళా వ్యతిరేకులు దానిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. మహిళా సాధికారతకు చంద్రబాబు కట్టుబడి ఉన్నారనడానికి తనను ఎమ్మెల్యేగా చేయడమే నిదర్శనమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం పట్టణ టిడిపి, బిజెపి, జనసేన ముఖ్య నాయకులతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐఐటి , నీట్ , ఒలంపియాడ్ ఫౌండేషన్ లో అగ్రగామిగా "శ్రీ గాయత్రి"




గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో గుంటూరు మెడికల్ కాలేజీ ఆడిటోరియం నందు రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకోవడంతో స్కూల్ నందు రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించిన హుమేరా, అరవింద్ రెడ్డి ,నైనిక ,వర్ధన్ లకు అభినందన సభ నిర్వహించారు. అలాగే ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఐఐటి ,నీట్ ,ఒలంపియాడ్ ఫౌండేషన్ టాపర్స్ ని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిఎంసి మెంబర్ కోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ గాయత్రి స్కూల్ విద్యార్థులకి స్కూలు స్థాయి నుంచే ఐఐటి ,నీట్ , ఒలంపియాడ్ ఫౌండేషన్ కి అద్భుతమైన కోచింగ్ ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ మాకాని వెంకటేశ్వర్లు, బెస్ట్ టీచర్ అవార్డీ రాధయ్య, స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి , ఉపాధ్యాయులు సుప్రజ ,రేవంతి ,ధనశ్రీ ,యామిని హరిత, నాసిర , మస్తాన్ బి, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నభూతో న భవిష్యత్ అన్న విధంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు.

**-కనీవినీ ఎరుగని రీతిలో మంత్రి ఆనం వేడుకలు నిర్వహించారు..ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్**



**ఆత్మకూరు... ఏప్రియల్..20/(విజ్ఞాన్‌ప్రతినిధి)** ఆత్మకూరు నియోజకవర్గం లో దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల్లో ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇందులో భాగంగా మృత్యుంజయ హోమంలో పాల్గొని కొంతమంది నియోజకవర్గ ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు పుట్టినరోజుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారు పండగల జరుపుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు కోసం మృత్యుంజయ హోమం ఏర్పాటు చేసి, న భూతో నభవిష్యత్ అన్న విధంగా మంత్రి ఆనం చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారని అన్నారు. చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ, కనీవినీ ఎరుగని రీతిలో మంత్రి ఆనం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు చేయడమే కాకుండా అనేకమంది ముఖ్యమంత్రులకు రోల్ మోడల్ గా నిలిచారని అన్నారు...

## దామిశెట్టి శ్రీనివాసనాయుడు విగ్రహావిష్కరణ



**కావలి విజ్ఞాన్ దినపత్రిక** కావలి రూరల్ మండలము, సర్వాయపాలెం గ్రామమునందు మాజీ మంత్రి వర్యులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, వైస్సార్సీపీ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా అధ్యక్షులు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి గారి చేతులమీదగా ప్రముఖ వ్యాపారవేత్త, రాజకీయ నాయకులు, విద్యావేత్త, దామిశెట్టి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్, డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ స్వర్గీయ దామిశెట్టి శ్రీనివాసనాయుడుగారి ప్రథమ వర్ధంతి సందర్భంగా వేలాది మంది ప్రజల మధ్య ఆయన విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో పార్టీలకతీతముగా, కుల,మత,వర్గ, ప్రాంతాలకు అతీతముగా రాష్ట్రములోని అన్నీ రంగాల వ్యాపార ప్రముఖులు, విద్యావేత్తలు, వైద్యులు, రాజకీయ నాయకులు, సంఘసంస్కర్తలు, మేధావులు, దామిశెట్టి బంధు మిత్రులు, దామిశెట్టి అభిమానులు, ఐదీూ ఇంజనీరింగ్ కాలేజి పూర్వ విద్యార్థులు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది, రెడ్ క్రాస్, ఐ.ఎం.ఏ, జన విజ్ఞాన వేదిక, వివిధ ఉపాధ్యాయ సంఘముల నాయకులు, బీస్, కాట్వ, రిటైర్డ్ అండ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, జిల్లాలోని వర్తక, వాణిజ్య సంఘ నాయకులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, ప్రజలు స్వచ్ఛందముగా తరలివచ్చి స్వర్గీయ దామిశెట్టి శ్రీనివాసనాయుడుగారి విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు శ్రీ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, చీరాల మాజీ శాసన సభ్యులు శ్రీ ఆమంచి కృష్ణమోహన్, ఆంధ్రప్రదేశ్ తెలుగు మరియు సంస్కృతము అకాడమీ చైర్మన్ శ్రీ ఆర్.డి.విల్సన్, మాజీ నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ శ్రీ వీరి చలపతి, మాజీ కావలి పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్ శ్రీ గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్, బి.జె.పి రాష్ట్ర కోశాధికారి శ్రీ కందుకూరి సత్యనారాయణ, కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి శ్రీ అలహరి సుధాకర్, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ కొట్టే వెంకటేశ్వర్లు ,ఖఎఎ చైర్మన్ పోతుగంటి అలేఖ్య మరియు వివిధ రాజకీయ పార్టీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన వరదరికి మరియు విచ్చేసిన నాయకులకు వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దామి శెట్టి సుధీర్ నాయుడు, డి బి యస్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ సురేష్ బాబు లు కృతజ్ఞతలు తెలిపారు.

## గోవా గవర్నర్ తో విజయదర్శిని ఎడిటర్



**విజయనగరం(విజయదర్శిని ప్రతినిధి)ఏప్రిల్ 20:** గోవా గవర్నర్ , మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక గజపతి రాజు ను విజయదర్శిని తెలుగు దిన పత్రిక ఎడిటర్ నెల్లూరు జిల్లా వాసి డా. పి. ప్రతీప్ కుమార్ రెడ్డి మర్యాద ప్ ్రా ం్ వ్ క్ ం గా విజయనగరంలోని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం కలిసి తమ పత్రిక ఉత్తరాంధ్రలో ఎదుగుదలకు ఆయన చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ భవిష్యత్తులో విజయదర్శిని తెలుగు దినపత్రిక మరింతగా అభివృద్ధి చెందాలని అందుకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.


## పేదవాడి ఆకలి తీర్చడమే సీఎం ధ్యేయం

**-అన్నా క్యాంటీన్ వేడుకల్లో మేయర్ సుజాత.**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకల్లో భాగంగా నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత అశోక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంత్రి నారాయణ పిలుపు మేరకు స్టోన్ హౌస్ పేటలోని అన్నా క్యాంటీన్ వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, సామాన్య ప్రజలతో కలిసి స్వయంగా క్యూలైన్‌లో నిలబడి భోజనం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పేదవాడి ఆకలి తీర్చాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన ఆశయమని, దానికి నిదర్శనమే నారా భువనేశ్వరి గారు 76 లక్షల రూపాయల భారీ విరాళంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమాలని కొనియాడారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,కలిసి ఆమె ప్రజల మధ్య కూర్చుని భోజనం చేస్తూ చంద్రబాబు నాయుడి ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ శివప్రసాద్ ,నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ,కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## యానాదులకు రుణ సౌకర్యం కల్పించక పోవడం అత్యంత దారుణం



**కావలి విజ్ఞాన్ దినపత్రిక:** యానాదులకు రుణ సౌకర్యం కల్పించక పోవడం అత్యంత దారుణమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా బోగోలు ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపిడి సుబ్రమణ్యంకు వినతిపత్రం అందచేసారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ జిల్లాలో యానాదుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని రుణ సౌకర్యాలు కల్పించక పోవడం వలన సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ నిర్వీర్యం అయిపోయిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశించినా అందులో ఉన్న కోట్ల రూపాయిలు ఇతర పథకాలకు మళ్ళించుకుంటూ యానాదులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. అందుమూలంగా యానాదులు గ్రామీణ ప్రాంతంలో ఉపాధి లేక పట్టణ ప్రాంతాలో ఒడ్ల మిషన్‌ల దగ్గర, సినిమా హాళ్ళ దగ్గర, అపార్ట్‌మెంట్ ల దగ్గర నాయకుల ఇళ్ళ దగ్గర కాపలాదారులుగా జీవిస్తున్నారని తెలిపారు. ఇటీవల వీరేపల్లి దగ్గర కట్టెలు కొట్టుటకు వెళ్ళుతూ ప్రమాదవశాత్తు మరణించారని తెలిపారు. అనేక చోట్ల మరణిస్తున్నా పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఎస్‌సి ఎస్‌టి కార్పొరేషన్‌ల నిధులను ఇతర పథకాలకు జగనన్న మళ్ళించుకొన్నారని చంద్రన్న అదే బాటలో నడుస్తున్నారని ఇది దారుణమైన విషయం అన్నారు. సమగ్రాభివృద్ధి సంస్థ ద్వారా యానాదులు గ్రామాలలో మేకలు, గొర్రెలు, పశువులు ఉపాధి కల్పించుకుని గౌరవంగా బ్రతుకుతారని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఐటిడిఏను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరుమోహన్‌రావు, బొచ్చు ఏసుపాదం, తుపాకుల శాంతమ్మ, భాస్కర్ అనేకమంది మహిళలు పాల్గొన్నారు.

# కోవూరు అన్న క్యాంటీన్ లో ఘనంగా సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

- ఆకలి లేని సమాజాన్ని నిర్మించాలన్న సిఎం చంద్రబాబు నాయుడులక్ష్యం.
- చంద్రన్న జన్మదినం సందర్భంగా అన్నా క్యాంటీన్ల పేదలు ఒక రోజు ఉచితంగా భోజనం చేసేందుకై నారా భువనేశ్వరి 76 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు.
- నాయకులు అభిమానంతో తీసుకొచ్చే బొకేలు, పూల మాలలకు బదులు నారా భువనేశ్వరి స్ఫూర్తిగా ఆ డబ్బులు అన్న క్యాంటీన్లకు విరాళంగా ఇవ్వండి.
- విడవలూరు మండలంలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రారంభించిన విపిఆర్ నేత్ర బస్సు మరియు బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో పి4 ద్వారా నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ సిఎం చంద్రబాబు జన్మదిన కానుకగా అందిస్తున్నాం.
- కోవూరు అన్నా క్యాంటీన్‌లో సామాన్యులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.





**విజ్ఞాన్ దినపత్రిక కోవూరు రిపోర్టర్** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లో భోజనం చేసే పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో ఆయన సతీమణినారా భువనేశ్వరి 76 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించిన నేపథ్యంలో... తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు అన్న క్యాంటీన్ లో సిఎం చంద్రబాబు నాయుడు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నా క్యాంటీన్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేసారు. అనంతరం అన్నా క్యాంటీన్లో భోజనం చేసేందుకు వచ్చిన వారికి స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడమే పరమావధిగా భావించే నాయకుడు చంద్రబాబు ఆలోచనల నుంచి పుట్టిన అన్నా క్యాంటీన్లు నేడు లక్షలాది మందికి ఆకలి తీరుస్తున్నాయని కొనియాడారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని అభిమానంతో తీసుకొచ్చే బొకేలు, పూలమాలలకు బదులు నారా భువనేశ్వరి స్ఫూర్తిగా ఆ డబ్బులు అన్న క్యాంటీన్లకు విరాళంగా యివ్వాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నాయకులకు హితోపదేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన కానుకగా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా విడవలూరు మండలంలో ఈరోజు ప్రారంభించిన విపిఆర్ నేత్ర గురించి ప్రస్తావించారు. అలాగే బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో సిఎం చంద్రబాబు నాయుడు డ్రీమ్ ప్రాజెక్ట్ పి4 ద్వారా నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ కూడా జన్మదిన కానుకగా అందివ్వనున్నట్టు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండల తెలుగుదేశం ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మోపాడు రిజర్వాయర్ ఆధునీకరణ ప్రారంభోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ , ఉగ్ర నరసింహా రెడ్డి .

-12,700 ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు అందించే భారీ యోజన..!

**కంబాలదిన్నె ఏప్రిల్ 20 :** ప్రకాశం జిల్లా కనిగిరి పరిధిలోని మోపాడు రిజర్వాయర్ మరియు అనుబంధ కాలువల ఆధునీకీకరణ కార్యక్రమానికి ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ , కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. మోపాడు రిజర్వాయర్ ఆధునీకరణ పనులను సుమారు రూ. 32.40 కోట్ల వ్యయంతో ఏపీ ఎల్.ఐ.పీ--జె.ఐ.సి.ఎ నిధుల ద్వారా చేపట్టడం జరిగింది. ఈ ఆధునికీకరణ పనుల ద్వారా ప్రకాశం జిల్లా లోని సుమారు 8,174 ఎకరాల ఆయకట్టుకు, అలాగే నెల్లూరు జిల్లా కొండాపురం మండల పరిధిలోని 4,545 ఎకరాల విస్తీర్ణానికి స్థిరమైన సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించబడింది. దీని ద్వారా వేలాది మంది రైతులకు మేలు చేకూరనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వాయర్లు, చెరువులు, కాలువలను సమగ్రంగా పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏళ్ల తరబడి



పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. వ్యవసాయం బలోపేతం అయితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం సభా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసిన నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని, గౌరవాన్ని వ్యక్తం చేశారు.

# ఘనంగా జరిగిన నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు..!

-ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం..!

-"జై చంద్రన్న -- జై జై చంద్రన్న" నినాదాలతో మారుమోగిన ప్రాంగణం..!

**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 20** వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు నందుగల ఎమ్మెల్యే కాకర్ల సురేష్ క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో, నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, యువత, కార్యకర్తలు మరియు అభిమానులు భారీగా తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. సమాజానికి ఉపయోగపడే ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా చంద్రబాబు నాయుడు పై తమకున్న అభిమానం, గౌరవాన్ని ప్రత్యేకంగా వ్యక్తం చేశారు. అనంతరం సభా ప్రాంగణంలో




భారీ కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను మరింత ఆనందోత్సాహాలతో కొనసాగించారు. ఈ సందర్భంగా "జై చంద్రన్న", "జైజై చంద్రన్న" అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగలాగా ఉల్లాసభరితంగా మార్చారు.

# ఆత్మకూరులో ఘనంగా నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు..!

-సీఎం జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు..!

-ప్రజల సంక్షేమమే లక్ష్యంగా శ్రమిస్తున్న నిత్యయువ నాయకుడు చంద్రబాబు నాయుడు .!






**ఆత్మకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 20** ఆత్మకూరు పట్టణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో, నవ్యాంధ్ర శిల్పకర్త, దార్శనికుడు, విజనరీ నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా, అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా యజ్ఞాలు, యాగాలు, వేదపండితుల ఆశీర్వచనాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, సమాజానికి మేలు చేసే అనేక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఈ మహోత్సవం లో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , కాకర్ల ప్రవీణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు 76వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఈ సందర్భంగా, ఆయన జీవిత ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఒక సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించి, విద్యార్థి నాయకుడిగా ప్రజా సేవలో అడుగుపెట్టి, ఐదు దశాబ్దాలుగా ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ వస్తున్న అరుదైన మహానేత అని కొనియాడారు. విజన్ 2020 అనే మహత్తర సంకల్పాన్ని ప్రకటించినప్పుడు అనేక విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, నేడు ఆ దూరదృష్టి ఫలితంగా ఐటీ రంగంలో అభివృద్ధి, హైటెక్ సిటీ నిర్మాణం, ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రానికి రావడం వంటి అంశాలు ఆయన నాయకత్వానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఒకప్పుడు "కంప్యూటర్లు కూడు పెడతాయా?" అని ప్రశ్నించినవారే, నేడు ఆయన దార్శనికతను ప్రశంసించడం విశేషమని తెలిపారు. ప్రజలకు చేరువగా పాలన అందించేందుకు "జన్మభూమి", "డయల్ యువర్ సీఎం" వంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టి, పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత ఆయనదేనని అన్నారు. విద్యుత్ రంగ సంస్కరణల ద్వారా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళా సాధికారత, విదేశీ విద్య పథకాల ద్వారా పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి ఎన్నో సంస్కరణలు ఆయన పాలనలో చోటుచేసుకున్నాయని వివరించారు. సామాజిక సమానత్వానికి ప్రాధాన్యతనిస్తూ సహపంక్తి భోజనాల ద్వారా కుల వివక్షను తగ్గించే ప్రయత్నం చేసిన సామాజిక సంస్కర్తగా కూడా ఆయన గుర్తింపు పొందారని చెప్పారు. నేటి వయసులోనూ విశ్రాంతి లేకుండా డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం వ్యాలీ వంటి భవిష్యత్ ప్రాజెక్టులతో రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తుండటం ఆయన అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. స్వంత కుటుంబం కంటే సమాజాన్నే పెద్ద కుటుంబంగా భావిస్తూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జీవిస్తున్న ఈ నిత్యయువ నాయకుడు తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత అని ఎమ్మెల్యే ప్రశంసించారు. అనంతరం నిర్వహించిన సేవా కార్యక్రమాలలో భాగంగా, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా వికలాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేయడం, వీవోఏలకు స్మార్ట్ ఫోన్లు అందించడం, పేదలకు ఇళ్ల పట్టాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాలు పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతూ, ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న కట్టుబాటును ప్రతిబింబించాయి.

# ఎమ్మెల్యే ఇంటూరి ఆధ్వర్యంలో... కందుకూరులో అట్టహాసంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుక

-పార్టీకార్యాలయం, అన్న క్యాంటీన్ లో కేక్ కటింగ్

-ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

**కావలి విజ్ఞాన్ దినపత్రిక:** ముఖ్యమంత్రి చంద్రబాబు 76వ జన్మదినం సందర్భంగా, కందుకూరులో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, బాబుగారి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలో పండుగ వాతావరణం ఏర్పడింది. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు.. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించి వేడుకలను ప్రారంభించారు. భారీ కేక్ కట్ చేసి, నేతలకు తినిపించారు. చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

**తరతరాలు గుర్తుంచుకునే గొప్పనేత చంద్రబాబు - మీూా నాగేశ్వరరావు**

తెలుగునేల చిరస్థాయిగా గుర్తుంచుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అమరావతి భవిష్యత్తుకు రూపకల్పన చేస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రం విడిపోయిన సందర్భంలో, బాబు గారు ప్రజల కోసం పడిన కష్టం మరువలేమన్నారు. ఆయన ఇచ్చిన ఒక్క పిలుపుతో 33 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేస్తే, జగన్మోహన్ రెడ్డి కక్షగట్టి అమరావతి నాశనానికి కుట్ర పన్నారని విమర్శించారు. సీనియర్ రాజకీయ వేత్తగా, భవిష్యత్తును సరిగ్గా అంచనా వేయగలిగే దార్శనికుడిగా చంద్రబాబు గారి అనుభవం... జగన్ లాంటి రాక్షసుల నుంచి మనల్ని కాపాడుతోందన్నారు. జగన్ హయాంలో పారిపోయిన కంపెనీలు, పెట్టుబడులు, తిరిగి చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి వస్తున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. అమరావతి, పోలవరం, ఐటీ కంపెనీలు, పోర్టులు.. ఇలా అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటం చంద్రబాబునాయుడు కే సాధ్యమన్నారు. గత ఏడాది ఆయన కందుకూరు వచ్చినప్పుడు, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 50 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రస్తావించారు. కందుకూరు పట్టణ రూపురేఖలు మారడానికి ఆయనే కారణమన్నారు. చంద్రబాబు సారధ్యంలో, రాష్ట్రం మరింత బలమైన ఆర్థిక, పారిశ్రామిక శక్తిగా తయారు కాబోతోందని అన్నారు.

**చలివేంద్రం ప్రారంభం:** పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. వేసవిలో ప్రజలు, ప్రయాణికుల కోసం మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

**అన్నక్యాంటీన్ వద్ద పేదలతో మమేకమై:** చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకొని పార్టీ నేతలతో కలిసి అన్న క్యాంటీన్ వద్ద భారీ కేక్ ను ఎమ్మెల్యే నాగేశ్వరరావు కట్ చేశారు. అన్న క్యాంటీన్ ట్రస్ట్ కు 76,000 /- విరాళం అందించారు. అలాగే పిడికిటి వెంకటేశ్వర్లు 27 వేలు, ఉప్పుటూరి శ్రీనివాసరావు 25 వేలు, అల్లం వెంకటేశ్వర్లు 7,600 రూపాయలు విరాళం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా పేదలందరికీ భోజనం వడ్డించారు. ఎక్కడి నుంచి వచ్చారు, ఆహారం ఎలా ఉంటుంది... అని వివరాలు అడుగుతూ వారిని పలకరించారు. అక్కడే నేతలతో కలిసి భోజనం చేశారు. చంద్రబాబు పుట్టినరోజున రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో ఉచితంగా అన్నదానం చేసేందుకు శ్రీమతి భువనేశ్వరి గారు, అన్న క్యాంటీన్ ట్రస్ట్ కు 76 లక్షలు అందించిన విషయాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అందరికీ గుర్తు చేశారు.

**ఆసుపత్రిలో పండ్లు పంపిణీ :** తర్వాత కందుకూరులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చంద్రబాబు గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించడంతోపాటు రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలిగేలా ఆయనకు ఆశీర్వచనాలు అందించాలని ఈ సందర్భంగా నేతలు రోగులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, సీనియర్ నాయకులు కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకటరమణయ్య, చిలకపాటి మధు, షేక్ రఫీ, షేక్ సలాం, షేక్ రూబీ, చదలవాడ కొండయ్య, వడ్డేళ్ల రవిచంద్ర, కూనం నరేంద్ర, మోదడుగు వెంకటేశ్వర్లు, అల్లం వెంకటేశ్వర్లు, రెబ్బవరపు మాల్యాద్రి, పొడపాటి మహేష్, ముచ్చు శ్రీను, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, షేక్ మున్నా, ముచ్చు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.